


# ఆనాటి అపురూప చిత్రాలు
## ఈనాటి సమగ్ర పరిచయాలు

- ప్రొ.డా.జ్ఞానేశ్వర రావు కె.వి.ఎస్



సినిమా రంగంలో విజయావారి బేనర్‌కి ఒక ప్రత్యేకతవుంది. వారు పక్కా సినిమా స్క్రిప్ట్ తయారుచేసుకునిగాని చిత్రీకరణ మొదలుపెట్టే ప్రశ్నే లేకుండా ప్రతి సంవత్సరం సంక్రాంతి కానుకగా సినిమాలు రిలీజు చేసేవారు. భవిష్యత్తులో ఎదురులేని హీరో, హీరొయిన్లుగా ఎదిగినప్రముఖులు, లబ్ధప్రతిష్ఠులు తొలిరోజుల్లో నెలవారీ జీతాలతో 'ఇగో ప్రాబలమ్స్' తలెత్తకుండా దర్శక, నిర్మాతలకి లోబడి క్రమశిక్షణతో ఒకే త్రాటిపై నడిచి పనిచేసేవారు. సాంకేతికబృందం సరేసరి–అంతా కలిసి ఒకే కుటుంబంలా మసలుకునేవారు. అది సినిమాల స్వర్ణ యుగం. అందువల్ల సినిమాచూస్తున్నంతసేపూ వినోదంతోపాటు ప్రేక్షకులు ఆయా పాత్రలతో తాదాత్మ్యంచెంది సన్నివేశపరంగా ఆయా అనుభూతులను నవరసభరితంగా పంచుకోవడం జరిగేది. పాటలుగాని, నృత్యాలుగాని అశ్లీలం చోటుచేసుకోకుండా సందర్భానుసారంగా, సాంప్రదాయరీతిలో పాలల్లో నీళ్ళలాగా కలిసిపోయి ఆహ్లాదాన్ని కలిగించేవి.

హాస్యం పాత్రోచితంగా కథాస్రవంతిలో కలిసిపారేది. వాస్తవికత,నాటకీయత, కాల్పనికత,సృజనాత్మకత సమపాళ్ళలో రంగరించినట్లుగా పడుగుపేకగా సాగేవి. ఒక దృశ్యకావ్యాన్ని ఆవిష్కరించడంలో నటీనటులు పోటీపడి నటించడమేగాక డైరెక్టర్ నుండి లైట్‌బోయ్ వరకు కథాచర్చల్లో పాల్గొని శ్రద్ధాసక్తులు చూపేవారు. 'జనం కోరేది మనం చేయాలి' అనే సంకల్పంతో జనరంజకంగా వినోదాన్ని అందించేవారు. 'షావుకారు' మొదలుకొని 'బృందావనం' వరకు ఎన్నో సినిమాలు తదుపరి చిత్రాలకు ఒరవడిగా , గీటురాళ్ళగా వెలిశాయి.(బ్లాక్ బస్టర్ క్లాసిక్స్‌తో పాటు కొన్ని ఫ్లాప్స్ కూడా జతగూడటం అనూహ్యం!)

అంతేకాక 'విజయా పతాక' సినిమాల్లోఎవరినీ నొప్పించకుండా సమకాలీన సాంఘిక సామాజిక సమస్యల ప్రస్తావన ఉండేది. పాటలు సందేశాత్మకంగా ఉండేవి. సంభాషణలు నిజజీవితానికి దర్పణం పట్టేవిగా మలచబడేవి. ఏ పాత్ర నిర్మాణంలోనూ అనౌచిత్యం కనిపించకపోగా, ఆ పాత్రలేనట్లు ఊహిస్తే లోటుగా,వెలితిగా, అసహజంగా అనిపించేది. ఆ 'జిగిబిగి' అంత పకడ్బందీగా ఉండేది. సంభాషణాచాతుర్యానికీ, చమత్కారాలకీ , సామెతలకీ, జాతీయాలకీ, లోకోక్తులకీ, నానుడులకీ కొదవలేదు. మాటలు,పాటలు సానబట్టిన చురకత్తుల్లా పదునుగా, మణిమాణిక్యాల్లా తళుక్కుమంటూ, కొత్త ఆవకాయఘాటులా చురుక్కుమంటూ, తేటతెనుగు తేనెలూరుతూ, భాషనేర్చేవాళ్ళకు పాఠ్యగ్రంథాల్లా ఉండేవి. మచ్చుకి ఒక్క పొల్లుమాటకూడా కానరాకుండా ప్రసిద్ధరచయితలు శ్రద్ధ తీసుకునే వాళ్ళు. పాటలు రసగుళికలే! గాత్రశుద్ధిగల గాయనీ గాయకుల గళాలనుండి జాలువారి అజరామరంగా ఆబాలగోపాలపు నాలుకలపై నర్తించేవి. కళ, ఫొటోగ్రఫీ, సినిమటోగ్రాఫీ బ్లాక్ అండ్ వైట్ రోజుల్లో కూడా అత్యున్నత ప్రమాణాల్లో అబ్బురపాటుగొలిపేవి. సాధారణ ప్రేక్షకుడిని కూడా సహజత్వంతో మొదలుపెట్టి, ఊహాలోకాల్లోకి తీసుకుపోయేవి.అంతర్లీనంగా సమాజానికి మేలుచేసే ఏదో ఒక సందేశం లేకుండా ఏ సినిమా ఉండేదికాదు.

# గుండమ్మ కథ - 6

సరోజ మేడ దిగి వస్తుంది.

గృహిణి: ఏమిటమ్మా వెతుకుతున్నావ్?

సరో: బ్యాగు మరిచిపోయాను. –డాబాపైకి వెళ్తుంది.

రాజా: ఏం.మళ్ళీ వచ్చావ్?

సరో: బ్యాగు మరిచిపోయాను.

రాజా: నీకంతా మతిమరుపేనా? మొన్న డబ్బులు మరిచిపోయావ్. ఇవాళ బ్యాగు మరిచిపోయావు. ఎప్పుడో నిన్ను నువ్వే మరిచిపోతావు. ఏం నేనన్నది అబద్ధమా?

సరో; ఇదుగో మీ డబ్బు.

రాజా: ఎందుకు? ఇచ్చేశావుగా?

సరో: ఎప్పుడు?

రాజా: ఇప్పుడే. నువ్వు చేసిన సేవో?

సరో: చాలు. అమృతాంజనం రాసినందుకు సరిపోయిందా?

రాజా: అవలేదనుకో. ఐనా నువ్వు నాకామాత్రం బాకీ ఉండాలికదా? –సరోజ సిగ్గుపడి పారిపోతుంది.

★★★

లక్ష్మి ఒడిలో గ్రంథంతో కూర్చుని వుంటుంది. మేడపై –అంజి సరోజ మైమరపులో ఉండటం చూస్తాడు.: ఏంటి చిట్టెమ్మా. ఆశ్రమంలో శకుంతలలాగా కూర్చున్నావ్? బుల్లోడు ఎక్కడైనా తగిలాడా?–– సరోజలేచి; అలాగన్నావంటే నాకు కోపమొస్తుంది.

అంజి: ఆఁ. నాకు తెలుసులే. అలాగే వుంటుందిలే చిట్టెమ్మా. మా అయ్యకి చీటి రాసుకోవాలిగాని ఏదీ ఒక తెల్ల కాగిటతం ఇవ్వు? –అంజి లక్ష్మి దగ్గరికి వెళ్ళి: బుల్లెమ్మా. ఒక ఉత్తరం ముక్క రాసిపెట్టు.

లక్ష్మి: ఎవరికి?

అంజి: నాకు. నాకంటే మా అయ్యకి. అయ్యోయ్.

లక్ష్మి: అలాకాదు. ప్రియమైన నాన్నకి.

అంజి: సరే అలాగే రాసుకో. రాశావా? నాకు గుండత్తగారింట్లో పని కుదిరింది. కడుపునిండా కూడు పెడతన్నారు. కట్టుకోడానికి గుడ్డలిస్తన్నారు. పెళ్ళికూడా చేస్తామంటున్నారు. –లక్ష్మి నవ్వుతుంది. :ఏంటి బుల్లెమ్మా పెళ్ళంటే నవ్వుతావ్? రాయిరాయి. అంతా బాగానేవుంది. ముఖ్యంగా మూడుముక్కలు. ఇక్కడ బుల్లెమ్మ అనే మాంచి అమ్మాయివుంది.

లక్ష్మి: నా సంగతేమిటి మధ్యలో?

అంజి: నీ సంగతేమిటి? నా సంగతేమిటి? రాయమంటే.రాయిరాయి. బుల్లెమ్మకి నేనంటే చాలా ఇది. ఇదంటే ఇది.

లక్ష్మి:ఊఁ.

అంజి: కడుపునిండా అన్నం పెడతది. నన్ను చాలా ఇదిగా చూస్తది. ఇంక వాళ్ళూ వీళ్ళూ ఎందుకు? బుల్లెమ్మనే ఇచ్చి చెయ్యమని గుండత్తని అడుగుదామనుకుంటున్నాను.

లక్ష్మి: తప్పుకదూ?ఏంటది?

అంజి: ఏంటి తప్పు?

లక్ష్మి: పెళ్ళికి ఇష్టమక్కర్లేదా?

అంజి: ఆఁ. నీ ఇష్టం నాకు తెలుసులే బుల్లెమ్మా. రాయి.

లక్ష్మి: నేను రాయను.

అంజి: ఇదుగో.రాయవూ? రాయదట.రాయదు. —కాగితం లాక్కుని పోతాడు. —డాబాపై వెన్నెలలో సరోజ. పెరట్లో తిన్నెపై రాసిన ఉత్తరం కాగితంతో అంజి కూర్చుంటాడు. లక్ష్మి వచ్చి సవరదీసే ప్రయత్నం లో ఉండగా——

పాట

సరోజ:

సన్నగ వీచే చల్ల గాలికి... కనులు  మూసినా కలలాయే....
తెల్లని వెన్నెల  పానుపుపై.. ఆ కలలో వింతలు కననాయే...
సన్నగ వీచే చల్ల గాలికి... కనులు  మూసినా కలలాయే....
తెల్లని వెన్నెల  పానుపుపై.. ఆ కలలో వింతలు కననాయే....
అవి తలచిన ఏమో సిగ్గాయె....
కనులు తెరచినా నీవాయే.. నే కనులు మూసినా నీవాయే... కనులు తెరచినా నీవాయే..

నిదురించిన నా హృదయమునెవరో కదిలించిన సడి విననాయే...
నిదురించిన నా హృదయమునెవరో కదిలించిన సడి విననాయే...
కలవరపడి నే కనులు తెరువ నా కంటి పాపలో నీవాయే...
ఎచట చూచినా నీవాయే...
కనులు తెరచినా నీవాయే.. నే కనులు మూసినా నీవాయే... కనులు తెరచినా నీవాయే..

మేలుకొనిన నా మదిలో ఏవో మెల్లని పిలుపులు విననాయే...
మేలుకొనిన నా మదిలో ఏవో మెల్లని పిలుపులు విననాయే...
ఉలికిపాటుతో కలయ వెతుక నా హృదయ ఫలకమున నీవాయే...
కనులు తెరచినా నీవాయే.. నే కనులు మూసినా నీవేనాయె...

లక్ష్మి ఉత్తరం పూర్తి చేస్తుంది. లక్ష్మికి కూడా గిలిగింతలతో చిలిపి తలపులు.

★★★

పద్మ వితంతు మేనత్త అన్నగారి ఇంటికి వచ్చి– : ఏం అన్నయ్యా. నేనీ ఇంటి ఆడబడుచునుకదా? పండగకీ పబ్బానికీ పిలిచేదే లేదు. పోనీ సిగ్గులేక నేనేవస్తే చేసే పని ఇదా? ––––వదినతో——ఏం వదినా? నేను వస్తున్నానని ముందే ఉత్తరం రాశానా? కాస్త కారు పంపించరాదూ? అబ్బబ్బబ్బబ్బ. —మూట వదిన చేతిలో పెడుతుంది. —

ఆమె అన్న–గృహస్తు గోపాలం: మొదలెట్టావ్?

ఆమె: ఏం? నా పుట్టింట్లో నాకామాత్రం స్వతంత్రం లేదూ? ఔనులే. అదంతా నాన్నతోనే పోయింది. నాన్న ఉన్నప్పుడు ఎలా జరిగిందో నీకుమాత్రం తెలీదూ? నువ్వుమాత్రం ఏం చేస్తావులే. ఇంట్లో అంతా ఆడపెత్తనమాయె. ఆ఼.అన్నయ్యా. పద్మ పెళ్ళి సంగతి ఏం చేశావు? మాబావగారు పంపించారు మాట్లాడడానికి. ఆయనకి ఒక్కడే కొడుకు. కుఱ్రాడు చాలా మంచివాడు. ఏదో ఆస్తిలో ఆస్తి కలిసొచ్చింది. నా కళ్ళని పడుంటాడని నా ఆశ.

గోపాలం: ఆ కొంపలో నిన్నిస్తే ఇంత వైభోగంగా వుంది. ఇంకా దానికి కూడా ఎందుకులే.

ఆమె: సరే నామాటే చెప్పు.——పద్మ మేడదిగివచ్చి... :అత్త దిగిందే?

ఆమె:ఇప్పుడే వచ్చానమ్మా.

పద్మ: రైల్లో వచ్చావా? టిక్కెట్టు కొన్నావా?

ఆమె: చూడన్నయ్యా.

గోపా: అత్తయ్యకదూ. మేనకోడలు సరసమాడుతోందిలే. అమ్మా. మీ అత్త నీకు సంబంధం తీసుకొచ్చింది.

పద్మ: ఏదేదీ?– పెట్టె తెరవబోతుంది.

మేనత్త: అది తెరవకు. నీకు పెళ్ళి సంబంధం తెచ్చానే.

పద్మ: నువ్వేం తేనక్కర్లేదు. నేను చూసుకుంటానులే.

మేనత్త: ఆ఼.ఎక్కడే? ఎక్కడ? —ఇద్దరూ పక్కకి వెళ్తారు.

గోపా: పెట్టె తెరిచి గిన్నెలు,గరిటెలు వగైరా చూసి భార్యతో——ఎక్కడో కొట్టుకొచ్చింది. ఇంట్లో సామాన్లన్నీ జాగ్రత్త. —

భార్య: ఏం చేసుకుంటుంది ఇవన్నీ?

భర్త: కాకిబుద్ధి. కనపడిందల్లా ఎత్తుకుపోతుంది.

మేనత్త పద్మని తీసుకువస్తుంది : ఏమన్నయ్యా? ఎవరో గుండమ్మ కొడుకుటగదా? ఆ అబ్బాయిని పెళ్ళిచేసుకుంటానంటుంది పద్మ.

గోపా: ఏవి఼టీ. గుండమ్మ కొడుకా? నీకేమైనా మతిపోయిందా ఏం?

పద్మ తల్లి: ఆ గయ్యాళి నిన్ను కాపరం చెయ్యనిస్తుందిటే?

పద్మ: ఏం చేస్తుంది? నా భర్త నామాట వింటే? అతను చాలా మంచి వాడు. ఆవిడ ఎటువంటిదైతే ఏం? ఆమెను దారికి తెచ్చుకుంటాను,. నేనేం పల్లెటూరిదాన్నికాదు. నూతిలో దూకడానికి. ఉరిపోసుకోదానికి.

మేనత్త: నేనుంటాగా నీకు తోడుగా! దానిసంగతి నేను చూసుకుంటాను. — ఒక ప్రాపుతో అక్కడ బిఛాణావేసే ప్లాను. —ఒప్పుకో అన్నయ్యా.

గోపా: సరే దానికి అంత ధైర్యమే ఉంటే అలాగే కానివ్వండి.

★★★

రాజా, సరోజ, ప్రభాకర్ ల ముందు పద్మ నృత్యం.(నేపథ్య సంగీతంతో)

(సశేషం)

★★★

COMMENTS